అంబర్‌పేట అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కృష్ణానగర్ బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ కృష్ణానగర్ బస్తీలో ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమ్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పాదయాత్రలో స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పాదయాత్ర సందర్భంగా ఓ మహిళ తనకు స్వంత ఇల్లు కట్టుకోవడానికి సహాయం చేయాలని కోరగా ఎమ్మెల్యే గృహలక్ష్మీ పథకం ద్వారా సీఎం కేసీఆర్ పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు. కృష్ణానగర్‌లో కమ్యూనిటీ హాల్, పబ్లిక్ టాయిలెట్స్, డ్రైనేజీ లైన్లు వేయించడం, గేటు నిర్మాణం, పాడైన రోడ్లకు మరమ్మత్తు పనులతో పాటు గుడి దగ్గర ర్యాంపు, కొత్త బోర్ ఏర్పాటు చేస్తామన్నారు. శానిటేషన్ పనులు సరిగ్గా జరగడంలేదని ప్రజలు పిర్యాదు చేయడంతో ఆ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. డీడీ కాలనీ ఫీడర్ పరిధిలో డీడీ కాలనీ, రాంచంద్రయ్య డిగ్రీ కాలేజ్, హిల్టన్ కేఫ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, బతుకమ్మ కుంట ఫీడర్ పరిధిలో ఆంధ్రబ్యాంక్, సిఈ కాలనీ పార్కు, వి.హనుమంతరావు హౌజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, ప్రీవెంటివ్ మెడిసిన్ ఫీడర్ పరిధిలో నారాయణగూడ, అంబేడ్కర్ కాలేజ్, రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీహాల్, సాయిబాబా దేవాలయం, సుందరయ్య పార్కు తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్, కిషన్‌రావు ఆసుపత్రి, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

పిల్లలకు తల్లిదండ్రులే ఆదర్శమూర్తులు



వార్షికోత్సవంలో సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

కవాడిగూడ: పిల్లలకు తల్లిదండ్రులే ఆదర్శమూర్తులని, తల్లిదండ్రుల ప్రవర్తనను చూసి పిల్లలు నేర్చుకుంటారని రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద అన్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో స్వామి వివేకానంద ఆడిటోరియంలో ఆర్యజనని 5వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మాచరణలో మంచితనంపై సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండాలన్నారు. సంకుచిత స్వభావాలు వీడి ఆధ్యాత్మికతకు సంబంధించి సానుకూల వాతావరణాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. ధాత్రి మదర్ మిల్క్ బ్యాంకు డైరెక్టర్ డాక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పుల్లారావు

కవాడిగూడ: మహిళలు ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ బండి పద్మ, ప్రముఖ సామాజికవేత్త, గ్రేటర్ హైదరాబాద్ మున్నూరుకాపు సంఘం మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కొత్త కృష్ణవేణి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని తెగల, బలిజ, కాపు సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆటలు ఆడి పాటలు పాడి ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్నూరుకాపు మహిళలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబర్‌పేట: తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకుంటే దీర్ఘకాలిక వ్యాధులను ముందుస్తుగా గుర్తించి నివారించవచ్చని డాక్టర్ పుల్లారావు తెలిపారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేటలోని డేకేర్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే నివారణ చికిత్సలు తీసుకోవాలన్నారు.

ఆటపాటలతో అలరించిన చిన్నారులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యూరో మిలినీయం తిరుమల హిల్స్ మలక్‌పేట స్కూల్ వార్షికోత్సవం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు ఆటపాటలతో ఎంతగానో అలరించారు. బుడిబుడి నడకలతో స్టేజీ మీదకు వచ్చి నృత్యం చేస్తూ సభికులను అబ్బురపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఏ.సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలపై బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు



మాట్లాడుతున్న గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

కవాడిగూడ: దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతున్న సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొలేక ప్రధాని మోదీ కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతూ ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసు నమోదు చేయించారని బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు ఆరోపించారు. ఈడీ, సీబీఐలు కేంద్ర ప్రభుత్వం కీలుబొమ్మలుగా మారాయని విమర్శించారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ కేసులో అక్రమంగా కవితపై కేసు బనాయించారని అన్నారు. వినీతి అక్రమాలకు పాల్పడ్డ నేతలు బీజేపీలో చేరితే వారిపై ఎలాంటి కేసులు లేకుండా వారికి సానుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రజనీకాంత్‌గౌడ్, గోరేబాయి, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శుల నియామకం



నియామకపత్రాలను అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మీడియా, కమ్యూనికేషన్స్ రాష్ట్ర కార్యదర్శిగా పరాంకుశ సత్యనారాయణరావు, రాష్ట్ర యువజన కార్యదర్శులుగా త్రిదండపాణి ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. బీసీ సంఘం భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రాలను అందుకున్నారు.

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సురభివాణీదేవి, ముఠాగోపాల్

చిక్కడపల్లి: ప్రముఖ జ్యోతిష్య పండితులు సంపన్ముడుంబై వెంకటాచార్యులు సిద్ధాంతి రూపొందించిన శుభకృత్ నామ సంవత్సర నూతన పంచాగం ఆవిష్కరణ చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగింది. ధరణిశ్రీ ఫౌండేషన్ సనాతన ధర్మ పరిరక్షణ సేనా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఖ్యఅతిథులుగా పాల్గొని వేద ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొండపాక కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



కాచిగూడలో నిర్వహించిన మాదిగల మహా సంగ్రామ యాత్రలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నేతలు

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ నేతలు ఈటి దర్శన్, ఎల్.శ్రీనాథ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం కాచిగూడ డివిజన్ వీరన్నగుట్ట, చెప్పల్‌బజార్, సూరజ్‌నగర్ బస్తీల్లో మాదిగల మహా సంగ్రామ యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు ఎడవల్లి యాదయ్య మాదిగ, గుజ్జల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోండి



ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో అమలు చేస్తున్న ఈ-శ్రమ్ కార్డులను అసంఘటిత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి.రచనశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం కవాడిగూడ డివిజన్ ఉన్నికోటలో బీజేపీ సీనియర్ నాయకులు మహంకాళీ జిల్లా ఓబీసీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ టి.రమేష్‌గౌడ్ అధ్యక్షతన అసంఘటిత కార్మికులకు కార్పొరేటర్ జి.రచనశ్రీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-శ్రామ్ కార్డులు పొందిన వారికి భీమా సౌకర్యం ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు అందుతాయని పేర్కొన్నారు. బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రామ్, మహంకాళీ జిల్లా అధ్యక్షులు సలాంద్రి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న రాజేందర్ పటేల్ గౌడ్

కాచిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులలో బీసీలకు ఒక్కరికి కూడా ఇవ్వకుండా బీసీలను పూర్తిగా విస్మరించారని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. ఆదివారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను విస్మరించిన పార్టీలకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అసెంబ్లీ ఎన్నిల్లో అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులిజాల కృష్ణ, ధరణీధర్ యాదవ్, భూషణ్ భాస్కర్, సిహెచ్ ప్రదీప్‌గౌడ్, తుంగబాబు, నల్లెల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి



పంచాంగం ఆవిష్కరిస్తున్న డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ

నల్లకుంట: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ద్వి సహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ చెప్పారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ(టీబీఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో గుడి ఉమామహేశ్వర శర్మ సిద్ధాంతి రూపొందించిన శోభకృత్ నామ సంవత్సర (2023-24) పంచాంగం ఆవిష్కరణ సభ జరిగింది. టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకోట సురేష్ చందర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి హిందువు పంచాంగం చదవడం అలవర్చుకోవాలని సూచించారు.

నల్లకుంటలో నిత్య జనగణమన

నల్లకుంట: నిత్య జనగణమనలో పాల్గొనడం ఎంతో ఆనందానుభూతిని కలిగించిందని పలువురు బాక్సర్లు పేర్కొన్నారు. నిత్య జనగణమన ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శివానంద నగర్‌లో జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు బాక్సింగ్ శిక్షకుడు ఉదయ్ కుమార్ నేతృత్వంలో 12 మంది బాక్సర్ల బృందం పాతబస్తీ లాల్ దర్వాజ నుంచి మారథాన్ చేస్తూ నల్లకుంటలోని జెండా కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ జాతీయ జండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో వందే ప్రజ శ్రీనివాస్, ప్రసాద్ దూబే, నల్లవెల్లి విజయేందర్ రెడ్డి, బాక్సర్లు పి. శైలెందర్ యాదవ్ పాల్గొన్నారు.



జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న పాత బస్తీ బాక్సర్ల బృందం

హిందూ శ్మశాన వాటికలో మరిన్ని సౌకర్యాలు



మాట్లాడుతున్న హిందూ ష్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు,సాయి గిరిధర్

కాచిగూడ: గోల్నాక డివిజన్, హరాస్‌పెంటలోని అంబర్‌పేట హిందూ శ్మశాన వాటికలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మరిన్ని మెరుగైన వసతులు కల్పించినట్లు హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు, సంయుక్త కార్యదర్శి సాయి గిరిధర్ తెలిపారు. కాచిగూడలోని ప్రబంధక సమితి కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. శవ దహన సంస్కారాలకు వచ్చే బంధు, మిత్రులకు అన్ని విధాల వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. దహన సంస్కారాలకు ప్రత్యక్షంగా హాజరు కాలేని దూర ప్రాంతాల వారికి ఆన్‌లైన్‌లో వీక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

సుల్తాన్‌బజార్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కాచిగూడ డివిజన్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ఈటీ దర్శన్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాలలో మాదిగల సంగ్రామ యాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకువెళ్లాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శోభాయాత్రను నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భగవంతరావు

అంబర్‌పేట: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శ్రీరామ నవమి శోభాయాత్ర ఘనంగా నిర్వహించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భగవంతరావు పిలుపునిచ్చారు. ఆదివారం గోల్నాకలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అంబర్‌పేట నియోజకవర్గం భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి శోభాయాత్ర నిర్వాహకులు బీ.వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో విలువలు, మానవనీయత, ఆదర్శం వంటి అంశాలకు శ్రీరాముడు ప్రతీక అనే సందేశాన్ని చాటేలా శోభాయాత్రలను నిర్వహించాలని ఆయన కోరారు. ఈ నెల 30 జరిగే శోభాయాత్రలకు ఇప్పటి నుంచి యువతను సమాయాత్తం చేయాలని ఆయన తెలిపారు.

కరెన్సీ నోట్లు, కాయిన్స్‌పై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలి



ధర్నా చౌక్‌లో దీక్ష చేస్తున్న తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు

కవాడిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లు, కాయిన్స్‌పై ముద్రించాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గంధం సుమన్‌యాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరెన్సీ నోట్లు, కాయిన్స్‌పై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో దీక్ష తలపెట్టారు. ఈ సందర్భంగా సుమన్‌మాదిగ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మెనిఫెస్టోలో విడుదల చేయాలని, అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

హిందూవులంతా ఐక్యంగా ఉద్యమించాలి

కాచిగూడ: హిందూ దేశ స్థాపనకు హిందువులంతా ఐక్యంగా ఉద్యమించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ పిలుపునిచ్చారు. హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని నృపతుంగ ఆడిటోరియంలో చేతన్ గాడి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసి ధార్మిక భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. యువత పాశ్చాత్య పోకడలకు బానిసలు కాకుండా భారతీయ సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రమేష్ షిండే, ఎస్తేర్ ధన్‌రాజ్, మహేష్ డేగ్లా, లలిత్ కుమార్, రవీంధర్ రెడ్డి, వినూత, కనక మహాలక్ష్మీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ అధ్యాత్మికవేత్త పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ

గోల్నాక సమగ్ర అభివృద్ధికి కృషి



గోల్నాక డివిజన్ అభివృద్ధి కోసం నగర మేయర్‌కు వినితి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ అభివృద్ధికి చేయుతనివ్వాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం మేయర్ నివాసంలో కలిసి డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై ఆమెకు కార్పొరేటర్ వినితి పత్రం అందించారు. డివిజన్‌లో మెజారిటీ పనులు ప్రారంభోత్సవాలకే పరిమితం అవుతున్నాయని, వాటిని పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. గోల్నాక పాతబ్రిడ్జి గ్రీనరి, బస్తీల్లో సీసీ రోడ్ల అభివృద్ధిపై కార్పొరేటర్ మేయర్‌తో చర్చించారు.

ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఏర్పాటుకు అహర్నిశలు శ్రమించిన ఉద్యమకారుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, రూ.10 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మానుకోట ప్రజా ప్రతిఘటన, మిలియన్ మార్చ్, సహాయ నిరాకరణ, సలక జనుల సమ్మె, సాగరహారం, సంసద్‌యాత్ర, అసెంబ్లీ ముట్టడి తదితర అనేక కార్యక్రమాలను ఉద్యమకారులు నిర్వహించినట్లు గుర్తు చేశారు. వీరిలో సుమారు 1200 మంది అమరులు తమ ప్రాణాలను త్యాగం చేయగా, వేలాది మంది వివిధ అనారోగ్య కారణాలతో, ఆర్థికంగా నష్టపోయినవారు ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరించడం సరైంది కాదన్నారు. వెంటనే ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరివర్ధన్ రెడ్డి, ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై ఫిర్యాదు



అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ ఆశోక్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి

అంబర్‌పేట: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి ఆదివారం అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆశోక్‌ను కలిసి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. మాజీ కార్పొరేటర్ వెంట బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ సులోచన, స్వరూప, స్రవంతి, నిర్మల, శ్రీనివాస్‌యాదవ్, హాబీబ్, విజయ్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: సీఎం సహాయ నిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ వెల్లడించారు. అనారోగ్యంతో, ఆరోగ్య సమస్యతో చేరి వైద్యం చేయించుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 5.07 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చేయూతనందిస్తున్నామన్నారు. లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరైయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజేస్, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.